## విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న జిల్లా ఉప వైద్యాధికారిణి గీత

ఆమనగల్లు, మార్చి 18: ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పది రోజులుగా డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుజల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దాదాపు 350 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు మంగళవారం జిల్లా ఉప వైద్యాధికారిణి గీత కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలు ఎక్కువ శాతం చూడటం వలన దృష్టిలోపం ఏర్పడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

చేవెళ్ల రూరల్, మార్చి 18 : వ్యవసాయ మార్కెట్ కమిటీల బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శంకర్‌పల్లి పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్ పర్సన్‌గా గోవిందమ్మాగోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా చంద్రమోహన్, పలువురిని డైరెక్టర్లుగా నియమించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళాకు విశేష స్పందన

ఇబ్రహీంపట్నం, మార్చి 18 : మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు మంగళవారం విశేష స్పందన లభించింది. ఇందులో 68మంది దరఖాస్తులు చేసుకోగా, 52మందిని ఉద్యోగాలకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా లీడింగ్ ఎలక్ట్రానిక్ కంపెనీ డైరెక్టర్ ఉష మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి.. తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు భిక్షపతి పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో తనిఖీ

కేశంపేట, మార్చి 18: కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలను మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తిరుపతయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2 పరీక్షలను 163మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 8మంది గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. పరీక్షల తీరును సిట్టింగ్ స్క్వాడ్ శివకుమార్ పరిశీలించారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కేశంపేట పోలీసులు బందోబస్తు నిర్వహించగా పరీక్షల తీరుపై ఫ్లయింగ్ స్క్వాడ్ తిరుపతయ్య సంతృప్తి వ్యక్తం చేసినట్లు వివరించారు.

## పట్టాపాస్ పుస్తకాలు అందజేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం/అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 18 : అనాజ్‌పూర్ గ్రామంలోని సర్వేనంబర్ 274, 275, 276, 277, 278, 281ల్లో 125మంది రైతులకు పట్టాపాసుపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికీ పట్టాపాసుబుక్‌లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహ, సీపీఎం నాయకులు ముత్యాలు, జంగయ్య, లింగస్వామి, భిక్షపతి, మహేష్, రాములు, యాదయ్య, రంగయ్య ఉన్నారు.


## 25న మెగా జాబ్ మేళా



నిరుద్యోగులతో మాట్లాడుతున్న ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, మార్చి 18: పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మండల నిరుద్యోగ యువతి, యువకులకు జాబ్‌మేళాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్ 50 పైగా కంపెనీలతో జాబ్ మేళాను ఏర్పాటు చేసి ఇందులో 5000పైగా ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేయాలి



మంచాల, మార్చి 18: ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న రోగులకు వైద్య ఖర్చులో సగం డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ప్రభుత్వం అందజేయాలని సీపీఎం జిల్లా నాయకుడు పోచమోని కృష్ణ అన్నారు. మంచాల మండలం బండలేమూరు గ్రామానికి చెందిన పార్వతికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సింహారెడ్డి సహకారంతో మంజూరైన రూ. 19వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం ఆయన బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరయ్య, గ్రామస్తులు అంజయ్య, రంగయ్య, వెంకటేష్, లింగస్వామి, జగదీశ్వర్, మహేశ్, రాజు, సాయిలు, యాదయ్య, శంకరయ్య, మహేందర్‌బాబు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్‌తోనే కొత్తూరు అభివృద్ధి

**నిర్మాణ పనుల్లో ప్రొటోకాల్ పాటించడంలేదు**
**మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యా దేవేందర్‌యాదవ్**
**రూ. 100కోట్ల ప్రొసీడింగ్స్ కాపీలతో మీడియా ముందుకు చైర్‌పర్సన్**



బీఆర్‌ఎస్ హయాంలో వచ్చిన ప్రొసీడింగ్స్‌ను చూపిస్తున్న కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యాదేవేందర్‌యాదవ్

కొత్తూరు, మార్చి 18: మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై ప్రొసీడింగ్స్ వచ్చినవే అని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో మున్సిపాలిటీలను దత్తత తీసుకొని అంజయ్యయాదవ్ చేసిందేమీ లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్న మాటలకు నిరసనగా మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేస్తే ఆ పనులను నేడు కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయలు కొడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెచ్చిన నిధులు ఏమిటో ప్రొసీడింగ్స్‌తో చర్చకు రావాలని వారు డిమాండ్ చేశారు. తాము 6 ఆరు వార్డుల్లో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పూర్తి చేశామని చెప్పారు. నిధులు ఉన్నా మిగతా ఆరు వార్డులో పనులను ఎందుకు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు, మున్సిపాలిటీ భవనం, సమీకృత వ్యవసాయ మార్కెట్, రైతు వేదిక, వైకుంఠధామం ఇంకెన్నో పనులు చేశామని చెప్పారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఉన్నాయి కాబట్టి ఎమ్మెల్యే కొత్తూరు వచ్చి ఒక్కో పనిని రెండు మూడు సార్లు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి అంటే 100 అడుగుల వెడల్పు గల కుమ్మరిగూడ రోడ్డును 24 అడుగులకు కుదించడం కాదన్నారు. ఎవరికి లబ్ధి చేకూర్చడానికి రోడ్డును కుదించారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. బీసీ కమ్యూనిటీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను అడుగడుగునా అవమానిస్తున్నారని విమర్శించారు. ఎక్కడ కూడా ప్రొటోకాల్ పాటించడంలేదని వాపోయారు. ప్రజలు ఎన్నుకున్న మున్సిపల్ పాలకవర్గానికి కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మున్సిపల్ పాలకవర్గ సమావేశం పెట్టుకోవడానికి ఎమ్మెల్యే పర్మిషన్ కావాలని మున్సిపల్ కమిషనర్ అంటున్నారని వాపోయారు. ఎమ్మెల్యే, కమిషనర్ కలిసి కొత్తూరులో ప్రారంభోత్సవాలు చేసుకుంటే ప్రజలు తమను ఎందుకు ఎన్నుకున్నారని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వం పనులు కాకుండా కొత్తగా ఏమైనా నిధులు తెచ్చి పనులు చేయాలని సవాల్ విసిరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, చంద్రకళ, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్ నాయకులు, గోపాల్ గౌడ్, రవినాయక్, శివచారి, సిటీకేబుల్ వెంకటేశ్, శ్రవణ్‌కుమార్ యాదవ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు అలుపెరగని పోరాటం



కడ్తాల్ : రిలే నిరాహార దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ నర్సింహముదిరాజ్

కడ్తాల్, మార్చి 18: ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేశారని బీఆర్‌ఎస్ నాయకుడు, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ నర్సింహముదిరాజ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతున్నది. మంగళవారం దీక్షలో కూర్చున్న వారికి నర్సింహ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాండు, కుమార్, జంగయ్య, గణేశ్, మహేశ్, అశ్వ ప్రహ్లాద్ పాల్గొన్నారు.

**చట్టబద్ధత కల్పించాలి**

మొయినాబాద్ : ఎస్సీ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌మాదిగ అన్నారు. అంతేకాకుండా అన్ని ఉద్యోగాల భర్తీల్లో మాదిగలకు అన్యాయం చేయొద్దని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు స్వేరో సర్కిల్ జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి నర్సింగ్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శంకరయ్య, రాజు, ప్రవీణ్ మద్దతు తెలిపారు.

**ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యం**

చేవెళ్లటౌన్ : ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వస్తేనే న్యాయం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివశంకర్, ఎంఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాని, భానుప్రసాద్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్సీ వర్గీకరణ నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రాములు, శాంతి కుమార్, నాయకులు మల్లేశ్, శివ, రాజుకుమార్, సత్యానందం, అశోక్, వినోద్‌కుమార్, వెంకటేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలను తొలగించాలి



మంచాల, మార్చి 18: మండల పరిధిలోని లోయపల్లిలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలంటూ మంగళవారం లోయపల్లి గ్రామానికి చెందిన గిరిజన సంఘం నాయకులు మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోయపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 43/2లో మూడు ఎకరాల పది గుంటల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొందరు అక్రమ కట్టడాలు నిర్మించారని వాటిని అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్‌సేవాలాల్ మహరాజ్, మారియమ్మ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం కోసం ప్రభుత్వ భూమిలో 5గుంటల స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీనివాస్‌నాయక్, రాజుకుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యం దిశగా సాగాలి




కేశంపేట: పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కేశంపేట, మార్చి 18: కఠినమైన పరిస్థితుల్లోనూ విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకుసాగాలని కేశంపేట మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంతోపాటు సాంస్కృతిక, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రిని గ్రామానికి చెందిన శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నర్సింహ, శ్రీను, మహేశ్, యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉత్తమ ఫలితాలు సాధించాలి**

నందిగామ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీటీసీల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొమ్ముకృష్ణ, కుమారస్వామిగౌడ్, ఎంపీడీవో సుమతి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదుకొని పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యార్థులు క్రమశిక్షణతో చదువాలి**

కడ్తాల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నతంగా ఎదుగాలని సీఐ శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జంగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ చైర్‌పర్సన్ విజయ, ఉపాధ్యాయులు రాధాకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్, శ్వేత, ఇంద్రారెడ్డి, కౌసల్య, భాగ్యలక్ష్మి, శోభారాణి, బుచ్చమ్మ, సునీత, భీముడునాయక్, భాగ్యమ్మ, గీతాభాయి, స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.



నందిగామలో జరిగిన వీడ్కోలు సమావేశం లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు




కడ్తాల్ : పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

## చెట్లను నరికితే చర్యలు

మాడ్గుల, మార్చి18: రోడ్లకు ఇరువైపులా చెట్లను నరికినా, కాల్చివేసినా వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాడ్గుల పోలీస్‌స్టేషన్‌లో ఎంపీడీవో ఫిర్యాదు చేశారు. మాడ్గుల శివాలయం నుంచి పెద్ద మాడ్గుల రోడ్డుకు పక్కన ఉన్న చెట్లను మంగళవారం కొంత మంది దుండగులు కాల్చి వేశారని, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాడ్గుల సీఐ వేణుగోపాల్‌రావును కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ 33 గ్రామ పంచాయతీల్లో పర్యావరణానికి హాని కల్గించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



మాడ్గుల రోడ్డు పక్కన కాలిపోయి ఉన్న చెట్లు

## పలు ఇండ్లలో చోరీ

చేవెళ్ల రూరల్, మార్చి 18 : మండల పరిధిలోని సింగప్పగూడ, న్యాలట గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. చేవెళ్ల ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సింగప్పగూడ గ్రామానికి చెందిన అంజిరెడ్డి (44) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి ఒంటిగంటకు బయటి నుంచి గడియ పెట్టారని తన కుమారుడు మొలుగు అంజిరెడ్డికి ఫోన్ చేసి తెలుపగా అతను వచ్చి తలుపులు తీసి.. పక్కన ఉన్న రూమ్‌కు వెళ్లి చూడగా అల్మారాను ధ్వంసం చేసి రూ.8 వేలు అపహరించారన్నారు. అదే విధంగా న్యాలట గ్రామానికి చెందిన ఒగ్గు నాగయ్య (65) భార్యతో కలిసి అత్తగారింటికి వెళ్లారు. పొరుగు ఇంటి వారు మంగళవారం ఉదయం నాగయ్యకు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి.. తాళం విరగ్గొట్టి ఉన్నదని చెప్పారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ.10 వేల నగదు కనిపించలేదు. న్యాలట గ్రామంలోని పలువురి ఇండ్లల్లోనూ దొంగలు చొరబడ్డారని గ్రామస్తులు వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

**కత్తులు, రాడ్లతో సంచారం..**

దుండగులు ముఖాలకు ముసుగు వేసుకొని.. కత్తులు, రాడ్లు పట్టుకొని సంచరించారు. రెండిండ్లలో చోరీ చేసిన అనంతరం మూడో ఇంట్లో చోరీ చేసేందుకు వెళ్లగా, అక్కడ సీసీ కెమెరాలు ఉండడంతో వెనుదిరిగారు. ముగ్గురు వ్యక్తులు సీసీ టీవీలో రికార్డు అయ్యారు. రామన్నగూడ గ్రామంలోనూ బైక్‌ను ఎత్తుకెళ్లారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనంతరెడ్డి

## ఓటరు జాబితాలో తప్పులను సవరించాలి

**ఆర్డీవో అనంతరెడ్డి**

ఇబ్రహీంపట్నం, మార్చి 18 : ఓటరు జాబితాలో సవరించిన వాటిలో ఇంకా ఏమైనా తప్పులుంటే సవరించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలపై ఎలాంటి అపోహలు, తప్పులుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు ప్రతాప్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి విజయ్‌కుమార్, బీఎస్పీ నాయకుడు ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నిధులను విడుదల చేయాలి



ఉపాధికూలీలతో మాట్లాడుతున్న శ్రీనూనాయక్

షాద్‌నగర్‌రూరల్, మార్చి18 : పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనూనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని పీర్లగూడెం, చించోడ్‌ల, అయ్యవారిపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపాధికూలీలకు తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఉపాధికూలీకి రూ.800లకు పెంచాలన్నారు. కూలీలకు జాబ్ కార్డులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు మల్లేశ్, చంద్రకాంత్, శ్రీనుయాదయ్య, శంకర్‌నాయక్, శివశంకర్, ఆంజనేయులు, కృష్ణయ్య, రామచంద్రయ్య, ముసలయ్య పాల్గొన్నారు.

## సహకార సంఘాల అభివృద్ధికి కృషి




సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్, మార్చి 18: సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులకు సకాలంలో రుణాలు అందించేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. సహకార సంఘం చైర్మన్ మాట్లాడుతూ ఐదేండ్ల కాలంలో మండలంలో మొత్తం 828 మంది రైతులకు రూ.5.62కోట్ల క్రాప్ రుణాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, 906 మందికి రూ.7.32కోట్లు, 469 మంది రైతులకు రూ.7.18కోట్లు బంగారంపై రుణాలు అందించినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ మల్లేశ్, సీఈవో శివకుమార్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు నర్సింహులు గౌడ్, రామచందర్, రైతులు పాల్గొన్నారు.

## ఫీజు చెల్లిస్తే రాయితీ కల్పిస్తాం



దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న మండల పరిషత్ కార్యాలయ అధికారులు

కేశంపేట, మార్చి 18: ఎల్‌ఆర్‌ఎస్ స్కీంకు దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31లోపు ప్రభుత్వ ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ వస్తుందని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 918మంది దరఖాస్తుదారులు ఫీజును చెల్లించినట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. లేఅవుట్ రెగ్యులేటరీ స్కీం- 2020లో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన జీవోకు అనుగుణంగా కేశంపేట మండలంలో 1200దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అప్పట్లో దరఖాస్తులు చేసుకున్నవారు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు పూర్తిగా చెల్లిస్తే 25శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రభుత్వ ప్రకటించడంతో దరఖాస్తుదారులు ఆసక్తి చూపారన్నారు. మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇప్పటి వరకు 918మంది ఫీజు చెల్లించడం సంతోషకరమన్నారు. ఈ నెల చివరి వరకు పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్ డెస్క్ 8125209849ను సంప్రదించాలని ఎంపీడీవో కోరారు.

## తాగునీటిని సరఫరా చేయాలి



గ్రామంలో తాగునీటిపై అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

మొయినాబాద్, మార్చి18: మంచినీటి సమస్య రాకుండా సక్రమంగా సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజూద్దీన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో తాగునీటి సమస్యపై సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాల తరలింపు.. వాహనాలు సీజ్



అక్రమంగా తరలిస్తున్న మూగజీవాలను పట్టుకున్న బజరంగ్ దళ్ నాయకులు

చేవెళ్లటౌన్, మార్చి 18: అక్రమంగా తరలిస్తున్న మూగజీవాలను చేవెళ్ల బజరంగ్ దళ్, బీజేవైఎం నాయకులు పట్టుకుని చేవెళ్ల పోలీసులకు అప్పగించారు.మంగళవారం సర్దానగర్ నుంచి చేవెళ్ల మీదుగా హైదరాబాద్‌లోని కబేళాలలకు మూడు వాహనాల్లో తరలిస్తున్న మూగజీవాలను బీజేవైఎం నాయకులు పట్టుకొని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు వాహనాలను సీజ్ చేసి, మూగజీవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి పశువులను నార్సింగ్ పరిధిలోని గోషాలకు తరలించారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ నాయకులు అనిల్‌కుమార్, గణేశ్‌యాదవ్, ధర్మ, రక్షా ప్రముఖ, రాఘవేంద్రాచారి, శివకుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.